# గ్లోబల్ చదరంగంలో జపాన్

1944లో నేల మట్టం అయిన జపాన్ డెబ్భైలలో ఒక గొప్ప పారిశ్రామిక దేశంగానూ, ఎనభై తొంభైలలోనూ ఆ తర్వాతా ఆర్థికంగానూ పారిశ్రామికంగానూ ఒక సూపర్‌పవర్ అయింది.

ప్రపంచ వ్యాపార చదరంగంలో జపాను అలా ఒక ముఖ్యమైన పాను ఎలా అవగలిగిందా అని నా కెప్పుడూ ఆశ్చర్యంగానే వుంటుంది.

క్వాలిటీ ఇంజనీరింగ్‌లో, ఏదయినా జరగవలసిన విధంగా జరగకపోతే (ప్రాడక్ట్ డిఫెక్ట్ కానీ ప్రాసెస్ డిఫెక్ట్ కానీ) దానికి మూలకారణం (రూట్ కాజ్ అనాలిసిస్) కనుక్కోటానికి, ఎందుకు ఎందుకు అని కనీసం మూడు నాలుగుసార్లయినా ప్రశ్నిస్తే సరైన సమాధానం దొరుకుతుంది అని ఒక సూత్రం వుంది.

అదే పద్ధతిలో ఇక్కడ కూడా ఆలోచించి చూస్తే.....

నలభైలలో మనలాగే పునర్జీవితం మొదలు పెట్టిన జపాను, జపం చేసుకుంటూ కూర్చోక, చకచకా ముందు బెంచీలోకి ఎలా వచ్చింది?

ఆ దేశానికి ఆవేశం పట్టుదల. గట్టి పట్టుదల. అనుకున్నది సాధించేదాకా వదలని పట్టుదల అని జవాబు.

అంత పట్టుదల ఎక్కడినించీ వచ్చింది?

మన దేశం, మన దేశం అనే ధ్యాస వాళ్ళకి ఆ పట్టుదలనిచ్చింది.

ఆ దేశభక్తి, దేశం మీద అంత ప్రేమ ఎక్కడినించి వచ్చింది? ఎలా వాళ్ళని నడిపించింది?

తమ దేశం నేలమట్టం అయి, మిగతా దేశాలు ముందుకు వెడుతుంటే భరించలేకపోయింది, వాళ్ళ రక్తంలోనూ నరనరాల్లోనూ జీర్ణించుకుపోయిన దేశభక్తి, మిగతా దేశాల ఎక్కువేమిటి, మా తక్కువేమిటి అనే భావన దృఢవిశ్వాసంలో వాళ్ళని ముందుకు నడిపించింది. ఏదయినా సరే సాధించి తీరాలనే కిల్లర్ ఇన్‌స్టింట్ వాళ్ళల్లో వుంది మరి.

టోక్యోనించి ఒసాకాకి రైల్లో వెళ్ళటానికి ప్లాట్‌ఫారం మీద నిలబడ్డప్పుడు, నాముందు నుంచున్న ఆయన నన్ను చూసి ముందుకి వంగి అభివందనం చేసినన్ను

ముందు రైరెక్కమంటాడు. ఇంకొక చిన్న కుర్రాడు, ప్లాట్‌ఫారం మీదకి ఎగిరి వచ్చిన చాకొలెట్ రేపర్‌ని తీసి, దూరంగావున్న గార్బేజ్ డబ్బాలో పడేసి వస్తాడు. ఆ దేశానికి వ్యాపార నిమిత్తం వచ్చిన వారిని గౌరవించటం, దేశాన్ని ఎంతో శుభ్రంగా వుంచటంలో ప్రతి మనిషీ తోడ్పడటం బాగా కనిపిస్తుంది. షాపులో ఏదయినా కొంటే ఆ వస్తువుని అక్కడ కొన్నందుకు అభినందనలతో గిఫ్టురాప్ చేసి ఇస్తారు. జపనీస్‌వారు మాట్లాడే మాటల్లో వాళ్ళ దేశాన్ని పొగడటం వాళ్ళ పరిశ్రమల గురించి, నాణ్యత గురించి గర్వంగా చెప్పటం తెలుస్తూనే వుంటుంది.

అంతేకాదు నేను వెళ్ళిన కొన్ని కంపెనీలలో చూసిన ఒక ఆశ్చర్యకరమైన విషయం చెప్పాలి. రోజూ ప్రొద్దున్నే అక్కడి ఉద్యోగస్తులందరూ గుమికూడి, గుండెల మీద చేతులు వేసుకుని, తమ కష్టమర్లు తమకు చాల ముఖ్యమనీ వాళ్ళని తృప్తిపరచటానికి ఏమైనా చేస్తామని ప్రతిజ్ఞ చేస్తారు. ఇది నాకు వింతగానే వున్నా నేను చూసిన విషయం కనుక వ్రాస్తున్నాను.

ఒక కంపెనీలోని డైరెక్టర్ ఆఫ్ క్వాలిటీతో మాట్లాడుతున్నప్పుడు, ఆయన "మా దేశంనించి సరిగ్గా పని చేయని ఒక టొయోటా కారు కానీ, సోనీ టీవీ కానీ, తొషిబా కంప్యూటర్ కానీ, కానన్ ప్రింటర్ కానీ, మినోల్టా కెమెరాకానీ బయటి దేశాలకు వెడితే, అది మాకు సిగ్గుచేటు. ఆ కంపెనీలకే కాదు, మాదేశానికి. అందుకే మేం ఏం చేసినా మా ప్రాణం పెట్టి పనిచేస్తాం" అన్నాడు.

పైన చెప్పిన కంపెనీల పేర్లు ఆ పరికరాల నాణ్యత చూస్తే ఆయన చెప్పినది అతిశయోక్తి కాదు నిజమేననిపిస్తుంది. అప్పుడప్పుడూ జపాన్ వస్తువులు పని చేయకపోవటం మనం చూస్తున్నా చాల అరుదు. చాలమంది ఏమీ ఆలోచించకుండా జపాన్ వస్తువులను కొనటానికి కారణం, వాటి నాణ్యతమీద వున్న నమ్మకం.

నాకు ఉద్యోగరీత్యా అక్కడ ఎన్నో కంపెనీల క్వాలిటీ సిస్టమ్‌లు పరిశీలించే అవకాశం దొరికింది. నేను వెళ్ళిన ప్రతిచోటా వాళ్ళ ధ్యాస ఒకటే.

నాణ్యత. నాణ్యత. నాణ్యత.

నేనూ, మైక్ పోయినసారి జపాన్ వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన ఎన్నటికీ మరువలేను.

శుక్రవారం రాత్రిదాకా పనిచేసి అలిసిపోయిన మేమిద్దరం శనివారం ప్రొద్దున్నే మేమున్న నరీటా అనే ఊరునించి టోక్యోకి వెళ్ళి ఆ నగరాన్ని చూసివద్దామని బయల్దేరాం. మా హోటల్ బస్సులో నరీటా ట్రైన్ స్టేషన్‌కి వెళ్ళాం. అక్కడి నించి టోక్యోకి వెళ్ళి చూడవలసినవన్నీ చూశాం. అది నవంబర్ నెల. అప్పుడే చలి ముదరటం మొదలుపెట్టింది. నేనూ మైక్, స్వెట్టర్లూ ఓవర్ కోట్లూ వేసుకున్నాం కనుక, వెచ్చగా హాయిగా వుంది.

టోక్యో ఇంపీరియల్‌పాలెస్, సెంసోజీ బుద్ధుడి గుడీ, గింజా కబుకిజా ఆర్ట్ థియేటర్ కొషికావా బొటానికల్ గార్డెన్ టోక్యో టవర్‌లాటివన్నీ చూశాం. టోక్యో, మెక్సికోనగరం మన కలకత్తా ముంబాయిలలాగా కోట్లమంది జనాభావున్న నగరం. ప్రపంచంలో చదరపు మైలుకి ఎక్కువ జనాభా వున్న నగరాలివి.అందుకే టోక్యోలో

ఎక్కడా ఖాళీ చోటు కనపడదు. ఎక్కడ చూసినా జనమే. టోక్యోని రెండతస్తుల నగరం అని కూడా అంటారు. దానికి కారణం, అండర్‌గ్రౌండ్ షాపింగ్ ఆఫీసులూ రైళ్ళూ అన్నీను టోక్యో మైన్ రైల్వేస్టేషన్‌లోనే, భూగర్భంలో నాలుగైదు అంతస్తుల మేర, ప్లాట్‌ఫారాలు, షాపింగ్ వున్నాయి ఇంత సందడిగా వుండే నగరమైనా, చాల శుభ్రంగా ఎంతో అందంగా వుంటుంది టోక్యో స్టేషన్‌నించీ బయల్దేరే బులెట్ ట్రైన్ ఒక పెద్ద ఆకర్షణ.

టోక్యో నగర సందర్శనం అయాక నేనూ మైక్ కాసేపు స్టేషన్‌లోనే షాపింగ్ చేసి, అక్కడే డిన్నర్ తినేసి, నరీటాలోని మా హోటల్‌కి వెళ్ళటానికి తిరుగు ప్రయాణం పట్టాం. అక్కడ అన్ని రైల్వే స్టేషన్లలోనూ, ప్లాట్‌ఫారం మీద గీతలు గీసి వుంటాయి, కోచ్ నెంబర్లూ ఏ సీట్ నెంబర్ వాళ్ళు ఏ తలుపులోనించి ఎక్కాలో లాంటి వివరాలతో. టిక్కెట్ల నెంబర్లు చూసుకుని లైన్లో నుంచున్నాం. అందరూ ఒకళ్ళకొకళ్ళు తగలకుండా ఆ లైన్లలో నుంచున్నారు. చాలమంది చేతుల్లో న్యూస్ పేపర్లూ, మేగజైన్సూ వున్నాయి. అదే వర్కింగ్ డే అయితే పుస్తకాలతోపాటూ చేతుల్లో బ్రీఫ్ కేస్‌లూ వుంటాయి. మగవాళ్ళు చాలమంది సూట్లు వేసుకున్నారు. ఆడవాళ్ళు రంగురంగుల డ్రెస్సుల్లో వున్నారు. సరిగ్గా మేము నుంచున్న చోటుకే వచ్చి ఆగింది మా కంపార్ట్‌మెంట్. ఆటోమేటిక్ డోర్ తెరుచుకోగానే, ముందు దిగేవాళ్ళు దిగాక లైన్లో వున్నవాళ్ళు ఒకొక్కళ్ళే నెమ్మదిగా ఎక్కారు.

రాత్రి ఏడు గంటలవటంవల్ల టోక్యో లైట్ల కాంతిలో వెలిగిపోతున్నది.

నరీటా స్టేషన్‌లో దిగి, హోటల్‌కి వచ్చి, ఎవరి రూముల్లోకి వాళ్ళం వెళ్ళిపోయాం. నేను నెమ్మదిగా సెటిల్ అయి, ఆస్టిన్‌లో మా ఇంటికి ఫోన్ చేద్దామనుకుంటుండగా, ఫోన్ మోగింది. మైక్.

"ట్రైన్‌లోనించి దిగినప్పుడు, నేను నా ఓవర్ కోట్ తీసుకురావటం నీకు గుర్తుందా?" అని అడిగాడు గాబరాగా.

"నాకు గుర్తులేదు. అసలేమయింది ఇంతకీ" అడిగాను.

"మనం ట్రైన్ ఎక్కగానే, అలవాటు ప్రకారం, నా ఓవర్ కోట్ తీసి పైన ఓవర్ హెడ్ రాక్‌లో మడచిపెట్టి పెట్టాను. దాంట్లో నా పాస్‌పోర్ట్, అమెరికా తిరిగి వెళ్ళటానికి రిటర్న్ టికెట్, ట్రావెలర్స్ చెక్స్, డబ్బులూ, క్రెడిట్ కార్డులూ,పర్సూ అన్నీ వున్నాయి. మనం ట్రైన్ దిగినప్పుడది తీసుకోవటం మర్చిపోయాననుకుంటాను" అతని గొంతులో ఆదుర్దా తెలుస్తూనే వుంది

"అవును. ఇప్పుడు గుర్తొచ్చింది నువ్వు కోటుతో దిగలేదు. అక్కడే వదిలేశావు" అన్నాను గుర్తుకు తెచ్చుకుంటూ

"మరిప్పుడెలా

"గాబరాపడకు మైక్. నేను రిసెప్షన్ కౌంటర్ దగ్గరికి వస్తున్నాను. నువ్వూ వెంటనే అక్కడికి రా" అన్నాను మళ్ళీ షూస్ వేసుకుంటూ.

నేను ఎనిమిదో అంతస్తులో ఎలివేటర్ ఎక్కితే, ఆరో అంతస్తులో అదే ఎలివేటర్‌లో మైక్ కూడా ఎక్కాడు.

'ఐ యామ్ ఇన్ బిగ్ ట్రబుల్' అన్నీ కోటు జేబులోనే వున్నాయి. ఇలా ఎప్పుడూ జరగలేదు" అన్నాడు. చలిగా వున్నా అతని నుదుటి మీద నాలుగు చెమట బిందువులు.

"ఏమీ కాదులెండి. పద" అని రిసెప్షన్ కౌంటర్ దగ్గరికి వెళ్ళాము.

సన్నగా పొట్టిగా అందంగావున్న రిసెప్షనిష్టు. ఆఅమ్మాయి జపనీస్ ఏక్సెంటులో ఇంగ్లీష్ మాట్లాడుతుంటే చాల స్వీటుగా వుంది అన్న మైక్, ఇప్పుడసలేమీ పట్టించుకునే స్థితిలో లేడు మరి.

నేనే ఆ అమ్మాయికి అన్నీ వివరంగా చెప్పాను. ఆ ట్రైన్ నెంబరు కోచ్ నెంబరు తెలుసా అని అడిగింది.

"తెలీదు" అన్నాడు మైక్. జేబులో నించి, నా టిక్కెట్ కౌంటర్ ఫాయిల్ తీసి ఆమె ముందుంచాను

జపాని అమ్మాయి కనుక, జపాన్ భాషలో జపాన్ రైల్వేవాళ్ళతో మాట్లాడింది. ఆ అమ్మాయి మాట్లాడుతున్న ఐదు నిమిషాలూ ఏమీ అర్థం కానందున, మైక్ ఆమెని నిస్సహాయంగా మార్చిమార్చి చూస్తూ అసహనంగా వున్నాడు.

ఫోన్ పెట్టేసి ఆ అమ్మాయి అంది. "అదిగో ఆ సోఫాలో కూర్చోండి. పదిహేను నిమిషాల్లో వాళ్ళు పిలుస్తామన్నారు" అంది.

ఏదో అనబోతున్న మైక్ చేయి పట్టుకుని తీసుకువచ్చి, సోఫాలో కూర్చున్నాను. మైక్ కూర్చోకుండా కాలుగాలిన పిల్లిలా సోఫా చుట్టూ తిరుగుతున్నాడు. మధ్యమధ్యలో ఆగి "నా కోటు దొరుకుతుందంటావా?" అని అడుగుతున్నాడు. నేను మాటిమాటికీ రిస్ట్‌వాచ్‌లో టైమ్ చూసుకుంటూ కూర్చున్నాను.

సరిగ్గా పన్నెండు నిమిషాలకి, కౌంటర్ దగ్గర ఫోన్ మోగింది. ఇద్దరం గబగబా కౌంటర్ దగ్గరికి వెళ్ళి ఫోన్‌లో ఆ అమ్మాయి మాట్లాడుతుంటే చూస్తూ వున్నాం. ఆ అమ్మాయి ఫోన్ పెట్టేసి, ఇద్దరికీ కలిపి ఒకే చిరునవ్వుని విసిరేసి "మీ కోటు చూసిన వాళ్ళెవరో దాన్ని సరీటా స్టేషన్లో కౌంటర్లో ఇచ్చారుట. మీరు వెళ్ళి ఫలానా చోట కౌంటర్లో, ఫలానా పేరు మనిషిని అడిగితే మీ కోటు మీకు ఇస్తారు" అంది.

ఇద్దరం వంగి, ఆ అమ్మాయికి అరిగాతో (థాంక్స్) చెప్పి, హోటల్ బయటికి వచ్చి, టాక్సీ ఎక్కాం.

"టాక్సీకి నాదగ్గర డబ్బుల్లేవు" అన్నాడు మైక్.

నేను నవ్వి "నా దగ్గర వున్నాయిలే" అన్నాను.

స్టేషన్‌కి వెళ్ళి, ఆవిడ చెప్పిన చోటుకి వెళ్ళాం. నేను పేర్లు చెప్పబోయే లోపలే, ఆ అమ్మాయి లోపలికి వెళ్ళి ఒక పాకెట్‌తో వచ్చింది.

"అది నీటీగా గిఫ్ట్ రాప్ చేసిన మైక్ ఓవర్ కోట్.

మైక్ గబగబా దాన్ని ఓపెన్ చేసి, అన్నీ సరిగ్గా వున్నాయో లేదో చూసుకున్నాడు. అతని ముఖంలో ఒక ఫ్లడ్ లైట్ వెలిగాక, ఆమెకి అరిగాతో చెప్పి మళ్ళీ టాక్సీ ఎక్కాం.

* * *